క్లుప్తంగా

సమయపాలన పాటించకపోతే చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్

గుత్తి: పట్టణంలోని 9వ వార్డు సచివాలయాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలన్నారు. సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని సూచించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

గుంతకల్లు టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో భిక్షాటన చేస్తూ ఓ గుర్తు తెలియని వృద్ధుడు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. స్థానిక పోలీసుల సమాచారం మేరకు మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ స్మశానవాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ నలుగురు సేవాసమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సమితి సభ్యులు మహేష్, వంశీ, రాము, భాస్కర్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లు టౌన్: పట్టణంలోని సీఐటీయూ కాలనీలో శనివారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర, తదితరులు సమాఖ్య జెండాను ఎగురవేసి వందనం చేశారు. యువతతో కలసి సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మారుతి, రాము, పరుశురామ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన

గుంతకల్లు టౌన్: 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వం చాటుకోవాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. శనివారం శ్రీశైల భ్రమరాంభిక జూనియర్ కళాశాలలో రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ ధీరజ్, ప్రిన్సిపాల్ వీరేష్, జేవీవీ నాయకులు చంద్రశేఖర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సూరి



సీపీఎం జెండా ఎగురవేసిన నాయకులు

పుట్లూరు: సీపీఎం మండల కార్యదర్శిగా సూరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండలంలోని కడవకల్లు గ్రామంలో సీపీఎం పార్టీ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లప్ప, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి హాజరయ్యారు. గత మూడు సంవత్సరాలుగా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా సూరితో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటచౌదరి, పెద్దయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్

పెద్దపప్పూరు: పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్లను శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. డ్రైవర్లు హజిత్‌కుమార్, రాఘవేంద్ర, చిన్న మద్దయ్య, పూజారి గణష్‌తో పాటు టిప్పర్ల యజమానులు కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన భీమేష్‌రెడ్డి, నల్లమేకలపల్లికి చెందిన రాజశేఖర్ నాయుడుపై కేసు నమోదు చేశారు.

కార్తీక పూజలు

శింగనమల: శింగనమలలోని పురాతన ఆత్మాసీతారామాలయంలో శనివారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మహిళలు దీపాలు వెలిగించారు. నెల రోజుల పాటు కార్తీక మాస పూజలు నిర్వహించేందుకు రామాలయం కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. రోజూ ఉదయం స్వామికి అభిషేకాలు, అలంకరణ, పూజలు జరగనున్నాయి.

కుంగిన కల్వర్టు.. స్తంభిస్తున్న రాకపోకలు

- కల్వర్టులో ఇరుక్కుపోతున్న వాహనాలు
- వాహనదారులకు తప్పనితిప్పలు
- పట్టించుకోని అధికారులు
- అధికారుల అలసత్వంపై స్థానికుల ఆగ్రహం



కల్వర్టులో ఇరుక్కుపోయిన ఆటో (ఫైల్)

గుంతకల్లు రూరల్: గుంతకల్లు, నాగసముద్రం మీదుగా పామిడికి వెళ్లే రహదారిలో మండలంలోని అయ్యవారుపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు పూర్తిగా కుంగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. గుంతకల్లు నుంచి నాగసముద్రం మీదుగా పామిడికి చేరుకునే రహదారి ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. రాత్రి పగలు అని తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారు. దీనికి తోడు జాతీయ రహదారిపై తనిఖీలను తప్పించుకునేందుకు ఈ రహదారిలో వెళ్లే భారీ వాహనాల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతూ వచ్చింది. 20 రోజుల క్రితం మండలంలోని అయ్యవారుపల్లి గ్రామ సమీపంలోనున్న కల్వర్టు కొద్దిగా కుంగిపోయింది. పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని గమనించిన అయ్యవారుపల్లి గ్రామస్తులు వెంటనే ఆర్అండ్‌బీ అధికారులకు సమాచారం అందించి కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. కానీ ఎవరూ స్పందించకపోవడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగుతూ వచ్చాయి. దీంతో కల్వర్టు రోజురోజుకూ కుంగుతూ వచ్చింది. రాత్రి పూట అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు కుంగిపోయిన కల్వర్టును గమనించక రోడ్డు ప్రమాదాలకు కూడా గురయ్యారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు. శుక్రవారం రాత్రి కల్వర్టు మరింత లోతుకు కుంగిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పామిడి, గుంతకల్లు మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ తిరిగే ఆర్టీసీ బస్సు రాకపోకలు కూడా నిలిచిపోయాయి. అయ్యవారుపల్లి నుంచి పామిడికి వెళ్లి చదువుకునే దాదాపు 40 మంది విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల బస్సుల్లో వెళ్లి పామిడిలో విద్యనభ్యసించే సమీప గ్రామాల విద్యార్థులెవరూ కూడా స్కూళ్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కనీసం ఆటో వెళ్లడం కూడా కష్టంగా మారిన తరుణంలో ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదంటున్నారు. ఇటీవల చింతలాంపల్లి గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో నేరుగా టీడీపీ నాయకులకే చెప్పినా పట్టించుకోలేదు. చివరికి కల్వర్టు కుంగిపోయి వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించే స్థితికి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు పామిడికి వెళ్లి చదువుకోవాలన్నా.. వ్యవసాయ సామగ్రి ఏదైనా తెచ్చుకోవాలన్నా రవాణా సౌకర్యం చాలా అవసరమని చెప్పినా పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే కల్వర్టు పూర్తిగా కుంగిపోయింది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టి భారీ వాహనాల రాకపోకలను నిషేధించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..



కల్వర్టు కుంగిపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇరవై రోజుల క్రితమే ఆర్ అండ్‌బీ డీఈ, జేఈకి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాను. అయినా వారు పట్టించుకోలేదు. ఇటీవల చింతలాంపల్లి గ్రామంలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమానికి మా గ్రామం నుంచి వెళ్లిన టీడీపీ కార్యకర్తలు స్వయంగా నేతలకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. రాత్రి పూట రహదారిపై ప్రయాణించే వాహనదారులు కల్వర్టు వద్ద ప్రమాదానికి కూడా గురయ్యారు. ఇప్పుడు ఏకంగా కల్వర్టు కుంగిపోయి రాకపోకలకే అంతరాయం ఏర్పడింది. కనీసం ఇప్పటికైనా కల్వర్టు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– ఎర్రపరెడ్డి, అయ్యవారుపల్లి

'కార్యకర్తలకు అండగా ఉంటాం'



రామాంజనేయులు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని నిదనవాడ గ్రామంలో ఎంపీటీసీ సునీతమ్మ భర్త రామాంజనేయులు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. అలాగే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతాప్‌రెడ్డిని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా ఉంటారన్నారు. కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌పీ నారాయణ రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సావిత్రి

గుత్తి: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సావిత్రి అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం సీపీఎం 10వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో కూడా మతలబు ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. ఇపుడు మాట మార్చి మొదట లబ్ధిదారులు డబ్బులు చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకుంటే రెండు రోజుల్లో చెల్లించిన డబ్బు బ్యాంకు ఖాతాలోకి జమ అవుతుందని చెబుతున్నారన్నారు. ఒక వేళ డబ్బు జమ కాకపోతే ఎవరిని అడగాలో తెలియడం లేదని మండిపడ్డారు. ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, ఆడపిల్లలకు నెలకు రూ.1,500, 50 ఏళ్లకే పింఛన్ ఇలా అనేక హామీలను ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ మరచిపోయిందని తెలిపారు. పింఛన్ల పెంపు తప్ప మిగతా హామీలను నెరవేర్చలేదన్నారు. త్వరలోనే ఉద్యమ కార్యాచరణ రూపొందించి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామన్నారు. అంతే కాకుండా గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యాచరణ రూపొందించి అందుకు అనుగుణంగా నడుచుకుంటామన్నారు. అంతకు ముందు సీపీఎం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, సీనియర్ నాయకులు రామకృష్ణ, మల్లి, మల్లేష్, రేణుక, రమేష్, మద్దిలేటి, రేవతి, వెంకట లక్ష్మి, శ్యామల, కవిత, రామేశ్వరి, రంజిత్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పశుగణన



వివరాలు తెలుసుకుంటున్న పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో పశుగణన చేయించడం వల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రేకులకుంటలో జరుగుతున్న అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుగణన చేపట్టడం వల్ల గ్రామంలోని మరింత రైతాంగానికి చేయూతను అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి గొర్రెలు, పశువు, కోళ్ల ఫారం యూనిట్ల మంజూరుకు పశుగణన ఉపయోగపడుతుందని వెల్లడించారు. గత నెల 25వ తేదీ నుంచి పశుగణన ప్రారంభమైనప్పటికీ సాఫ్ట్‌వేర్‌లో కొన్ని సమస్యలు తలెత్తడం వలన ఆలస్యం కావడం జరుగుతోందన్నారు. పశుగణన త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రేకులకుంటలో జరుగుతున్న పశుగణనపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రత్నకుమార్, పశు వైద్య సహాయకులు సరస్వతి, ప్రవీణ్, శివయ్య, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గుత్తి రూరల్: రోజూ సమయానికి విధులకు హాజరు కాని సచివాలయ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఊబిచెర్ల గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు వంద శాతం బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ఎందుకు ప్రారంభించారు అని సిబ్బందిని ప్రశ్నించారు. సకాలంలో పింఛన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శి సాదిక్‌వలి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అబ్దుల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్సిజన్ సిలిండర్ వితరణ



పామిడి కమ్యూనిటీ ఆసుపత్రికి ఆక్సిజన్ సిలిండర్ అందజేస్తున్న మురళీధర్ గుప్తా

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రికి స్థానిక భోగేశ్వరాలయ కమిటీ చైర్మన్ ఎస్.మురళీధర్ గుప్తా శనివారం ఆక్సిజన్ సిలిండర్ అందజేశారు. రూ.25 వేలు విలువైన సిలిండర్‌ను ఆసుపత్రి వైద్యాధికారి జి.శివకార్తీక్ రెడ్డికి అందించారు. దాతకు ఆస్పత్రి సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు, కవి కె.నారాయణ మూర్తి, మండల అధ్యక్షుడు ఉపేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా సమాధుల పండుగ



సమాధులను పూలతో అలంకరిస్తున్న దృశ్యం



పామిడి: కొవ్వొత్తులు వెలిగిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న క్రైస్తవ శ్మశానవాటికలో శనివారం సమాధుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు.. తమ పెద్దల సమాధులను శుభ్రం చేయించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. సమాధులపై పూలు చల్లి, కొవ్వొత్తులు వెలిగించారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సభ్యులు వీరయ్య, పీసీ రత్నరాజు, అనిల్‌కుమార్ రాజా, అబ్రహాం, ప్రకాష్, సురేష్, ప్రసాద్, అల్లీపీరా, బాలకుమార్, రమణ, స్టానీ, స్వప్నిల్, ప్రిస్కిల్లా, వాత్సల్య తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: పట్టణంలోని పోరాట కాలనీ సమీపంలో ఉన్న క్రైస్తవ సమాధుల వద్ద శనివారం రాత్రి సమాధుల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తురాజు చర్చి పాదర్ డేవిడ్ అర్లప్ప, రాజశేఖర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు సమాధుల వద్దకు చేరుకుని సమాధులను పూలతో అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఏడాది నవంబర్ 2న సమాధుల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

రేపటి నుంచి 'కార్తీక' ఉత్సవాలు



ఆలయం ముందు ఆకట్టుకుంటున్న రంగవల్లులు



ప్రత్యేక అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు

తాడిపత్రిటౌన్: కార్తీకమాస ఉత్సవాలకు తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 4 నుంచి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక క్యూలైన్లు, నూతన రోడ్డు నిర్మాణం, ఆలయ పరిసరాల్లో భక్తులను ఆకట్టుకునేలా రంగవల్లు వేయించారు. ఈనెల 4న సహస్ర లింగార్చన, 11న అష్టోత్తర శత కలశాభిషేకం, 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆకాశ దీపోత్సవం, జ్వాలాతోరణం, 18న కేదారేశ్వర నోములు, 25న కార్తీక దీపం, 29న లక్ష బిల్వార్చన, డిసెంబర్ 1న పద్మాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాల్లో పాల్గొనాలని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు సూచించారు.

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్

పెద్దవడుగూరు/గార్లదిన్నె/తాడిపత్రి టౌన్/యల్లనూరు: గ్రామాల్లో చట్ట విరుద్ధమైన కార్యకలపాలకు పాల్పడితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. శనివారం పెద్దవడుగూరు, గార్లదిన్నె, తాడిపత్రి, యల్లనూరు మండలాల్లోని పలు గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. గ్రామాల్లో యువత గంజాయి, మద్యం గుట్కా తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఆక్రమణల తొలగింపు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సోనియా గాంధీ కాలనీలోని ఎల్‌పీ నం.49–1985 నందు ఉన్న ఓపెన్ సైట్‌లో ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. శనివారం కమిషనర్ నయీమ్ అహ్మద్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఓపెన్‌సైట్‌లో పాతిన బండలను తీసివేయించారు. రిజర్వ్‌డ్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు చేపడుతామని కమిషనర్ హెచ్చరించారు.

ఫైర్ స్టేషన్ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



కమిషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలం కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయించకపోతే కబ్జాకు గురి అయ్యే అవకాశముందని తెలిపారు. వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఫైర్ స్టేషన్ స్థలాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జ్ఞానేశ్వర్ రెడ్డి, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటీలో 'సర్జితాన్ 2కే24'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక ఆవిష్కరణలు ఎంతో అవసరమని ఎస్ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. శనివారం మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ సర్జితాన్–2కే24పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సర్జితాన్ 2కే24 అనేది ఒక డైనమిక్ ఈవెంట్ అన్నారు. ఇది పరిమిత కాల వ్యవధిలో సహకరించడానికి ఆవిష్కరణలకు విభిన్న రంగాలకు చెందిన ప్రకాశవంతమైన మనస్సులను ఒకే చోట చేర్చిందన్నారు. ఈవెంట్‌లో ఆకట్టుకునే ప్రదర్శనలతో పాటు బృందం, వారి నమూనాల బావనలను ప్రదర్శించారు. న్యాయ నిపుణులు ఆవిష్కరణ, సాంకేతిక అమలు ప్రభావం, ప్రదర్శన ఆధారంగా ప్రాజెక్టులను ఎంపిక చేశారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఆంజనేయులు, హెచ్ఓడీ మేరిమాత, కో–ఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

తాడిపత్రి టౌన్: మండలంలోని తాడిపత్రి–బుగ్గ ప్రధాన రహదారిపై ఆలూరు క్రాస్ వద్ద శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. సజ్జలదిన్నె గ్రామానికి చెందిన దూదేకుల రాజమ్మ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు సంచిని పరిశీలించారు. అందులో 12 మద్యం బాటిళ్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గద్దంనాయుడు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

యల్లనూరు: మండలంలోని శింగవరం గ్రామానికి చెందిన ఈడిగ రామాంజనేయులు, కోడుమూర్తి గ్రామానికి చెందిన వీరాంజనేయులు నుంచి 212 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం వీరు ద్విచక్ర వాహనంలో అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా యల్లనూరు చెరువు కట్టపై పట్టుకున్నారు. ప్రభుత్వ ధరల కన్నా ఎక్కువ ధరలకు అమ్ముకునేందుకు తాడిపత్రి నుంచి మద్యాన్ని తరలిస్తున్నారని ఎస్ఐ శ్రీరాం ప్రసాద్ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ప్యాచ్‌వర్క్‌కు భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లుటౌన్: రహదారులపై ఏర్పడిన గుంతలను వంద రోజుల్లోపు పూడ్చి గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే జయరాం అన్నారు. మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా శనివారం కసాపురం రోడ్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా రహదారిపై ప్యాచ్‌వర్క్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 7 రహదారుల్లో ఏర్పడిన గుంతలను పూడ్చడానికి రూ.54 లక్షలు ఖర్చుచేయనున్నట్లు తెలిపారు. గుంతకల్లు–మద్దికెర మార్గంలోని ఆర్అండ్‌బీ రోడ్డులో ఉన్న గుంతలన్నీ పూడ్చేందుకు రూ.6 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. రానున్న 100 రోజుల్లోపు ప్యాచ్ వర్క్‌లను పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ జేఈ లక్ష్మీదేవి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.